# సభాపతి ఏకపక్షం



శనివారం గవర్నర్ ఎన్.డి.తివారీకి వినతిపత్రం అందజేస్తున్న తెదేపా అధినేత చంద్రబాబు

- మా రాజ్యాంగ హక్కులు కాలరాశారు
- రాష్ట్ర పెద్దగా స్పందించండి
- గవర్నర్‌కు విపక్షాల వినతిపత్రం

**హైదరాబాద్, న్యూస్‌టుడే:** శాసనసభలో సభాపతి కె.ఆర్.సురేష్‌రెడ్డి, అధికారపక్ష వ్యవహార శైలి రాజ్యాంగ వ్యవస్థను దిగజార్చేలా ఉందంటూ తెలుగుదేశం, తెలంగాణ రాష్ట్ర సమితి, సీపీఐ, సీపీఎం, బీఎస్పీలు శనివారం గవర్నర్ ఎన్డీ తివారీని కలిసి విన్నవించాయి. ఆయన్ను స్వయంగా జోక్యం చేసుకోవాలని అభ్యర్థించాయి. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా సభాపతిపై తాము అవిశ్వాస తీర్మానం పెట్టాల్సివచ్చిందని, అవిశ్వాసంపై చర్చను కూడా సవ్యంగా నిర్వహించకుండా సభను వాయిదా వేశారని గవర్నర్‌కు తెలిపాయి.

శనివారం మధ్యాహ్నం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు, సీపీఐ, సీపీఎం, తెరాస శాసనసభాపక్ష నాయకులు చాడ వెంకట్‌రెడ్డి, నోముల నర్సింహయ్య, ఈటెల రాజేందర్, బీఎస్పీ నాయకుడు కత్తి ధన్‌రాజులతోపాటు ఎమ్మెల్యేల బృందం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిశారు. 13 ఆరోపణలతో వినతి పత్రాన్ని అందజేశారు. సభాపతి పూర్తిగా ముఖ్యమంత్రి, శాసనసభ వ్యవహారాల మంత్రి, చీఫ్ విప్‌ల కనుసన్నల్లో సభను నడుపుతున్నారని ఆరోపించారు. గడిచిన నాలుగేళ్లలో 27 సార్లు తెదేపా సభ్యులను సస్పెండ్ చేశారన్నారు. ప్రతిపక్ష పార్టీలను విమర్శించేందుకు అధికార పార్టీకి ప్రత్యేకంగా సమయం ఇస్తున్నారని, దేశంలో ఎక్కడాలేని విధంగా తెదేపా ఎమ్మెల్యే కరణం బలరామ్‌ను ఆరు నెలలపాటు సస్పెండ్ చేశారని చెప్పారు. కనీసం ఒక్కసారి మాట్లాడే అవకాశంకూడా ఇవ్వలేదన్నారు. సభాపతి రాజ్యాంగం కల్పించిన హక్కులను కూడా వినియోగించుకునే అవకాశాన్ని సభ్యులకు ఇవ్వడం లేదన్నారు. తెరాస ఎమ్మెల్యేలు 10మందిపై పార్టీ ఫిరాయింపుల చట్టం కింద చర్యలు తీసుకోవాలని రెండేళ్ల క్రితం ఫిర్యాదు చేసినా ఇప్పటికీ ఎలాంటి చర్యా తీసుకోలేదని విమర్శించారు. ఇందుకు కారణం అధికార పార్టీ ఒత్తిడేనన్నారు. అవిశ్వాస తీర్మానం సందర్భంగా కూడా తెరాస అసమ్మతి ఎమ్మెల్యేలు పదిమంది, తెదేపాకు చెందిన ఒక సభ్యుడు విప్‌ను ధిక్కరించారని చెప్పారు. సమాజ్‌వాదీ, జనతా ఎమ్మెల్యేలను ఆయా పార్టీలు సస్పెండ్ చేసినా వారికి సభలో మాత్రం ప్రత్యేక హోదాలు కట్టబెట్టారని, ఆ ఎమ్మెల్యేలు బహిరంగంగా కాంగ్రెస్ కార్యకలాపాల్లో పాల్గొంటున్నారని తెలిపారు. రాష్ట్ర పెద్దగా గవర్నర్ జోక్యం చేసుకోవాలని కోరారు.

## గవర్నర్ ఆత్మీయ పలకరింపు

రాజ్‌భవన్‌కు వచ్చిన విపక్ష నాయకులను గవర్నర్ ఆత్మీయంగా పలకరించారు. నన్నపనేనిని 'రాజమహేంద్రీజీ' అంటూ ఆమె కాంగ్రెస్‌తో పనిచేసిన రోజులను గుర్తు చేసుకున్నారు. నాయకులను పరిచయం చేసుకున్నారు. కూర్చోబెట్టి అల్పాహారం, టీ, కాఫీలు ఇచ్చారు. అయిదు పేజీల వినతిపత్రాన్ని పూర్తిగా చదివారు. సందేహాలను అడిగి తీర్చుకున్నారు. తివారీ దగ్గర న్యాయం జరుగుతున్న నమ్మకం తమకుందని చంద్రబాబు అన్నారు. వినతిపత్రంపై తగురీతిలో స్పందిస్తానని గవర్నర్ హామీఇచ్చారు. చంద్రబాబుతో ప్రత్యేకంగా రెండు నిమిషాలు మాట్లాడారు. సభాపతి వ్యవహార శైలిని జాతీయస్థాయికి తీసుకెళ్తామని విపక్ష నేతలు విలేకరులకు చెప్పారు.